సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 19 । జూన్ । 2025



తల్లికి వందనం అడిగితే దాడి

తల్లికి వందనం సొమ్ము ఖాతాకు జమ కాలేదు, ఎందుకు కాలేదో చెప్పాలని కోరిన గ్రామస్తులపై సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ దాడి చేసి ముగ్గురుని గాయపరచాడు. -10లో



రియల్టర్ హత్యకేసులో వీడిన మిస్టరీ

మదనపల్లె పట్టణంలో సంచలనం సృష్టించిన రియల్టర్ గంగాధర హత్యకేసు మిస్టరీ వీడింది.గంగాధర భార్యతోతో పాటు మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.120	రూ.170

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1564 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్: జిల్లా వ్యాప్తంగా ఆశా వర్కర్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఉషశ్రీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 19 పోస్టులు ఖాళీగా ఉండగా అందులో గ్రామీణ స్థాయిలో 17, పట్టణ ప్రాంతాల్లో 2 పోస్టులు ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఆయా గ్రామాల్లో నివసిస్తూ, పెళ్లి అయిన లేదా వితంతువులు, విడాకులు పొందిన, భర్తతో విడిపోయిన వారికి ప్రాధాన్యత కల్పించనున్నట్లు చెప్పారు. వయస్సు కనీసం 25 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు.10వ తరగతి పాసై ఉండాలని తెలిపారు. దరఖాస్తులను జిల్లాకేంద్రం రాయచోటి పట్టణంలోని మాసాపేటలో ఉన్న వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీలోగా అందజేయాలని కోరారు.

ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా జూనియర్ బాలుర ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 60 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో 30 మందిని ఎంపిక చేసినట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు. రెగ్యులర్ క్యాంపు నిర్వహించి వారిలో ఉత్తమ జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఈనెల 29, 30 తేదీల్లో వేద పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కమలేష్, అభిలాష్, బాలాజీ, మోహన్‌రెడ్డి, నరేంద్ర, అబ్దుల్లా, విజయ్ పాల్గొన్నారు.

పాడి ఆవులకు టీకా వేయించాలి

వీరబల్లి: పాడి పరిశ్రమతో రైతుల కుటుంబాలు ఆర్థికంగా మెరుగుపడతాయని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై తెలిపారు.బుధవారం మండల కేంద్రంలోని పశువైద్యశాలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి ఆవులకు సకాలంలో టీకాలు వేయించాలన్నారు. జిల్లాలో ఎక్కడా టీకాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఒక్కో ఆవుకు రూ. 150లు చెల్లించి ఇన్సూరెన్స్ పొందాలన్నారు. ఒక్కో రైతు పది ఆవులకు ఒకే రైతు పేరు మీద ఇన్సూరెన్స్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీడీ మాలకొండయ్య, ఏడీలు విజయ్ కుమార్, శ్రీధర్ రెడ్డి, డాక్టర్లు రవికుమార్, నాగరాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తోతాపురి మామిడికి మద్దతు ధర

రాయచోటి టౌన్: తోతాపురి మామిడి కాయలకు (బెంగుళూరు రకం) ప్రభుత్వం కిలో రూ.4ల చొప్పున మద్దతు ధరల ప్రకటించిందని రాయచోటి ఉద్యానశాఖ అధికారి (హెచ్‌వో) గుడె సురేష్‌బాబు తెలిపారు. బుధవారం రాయచోటి ప్రాంతంలోని మండీల వద్ద రైతులతో మాట్లాడుతూ తోతాపురి మామిడికి ఫ్యాక్టరీల వద్ద ధరలు తగ్గినందున ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొందన్నారు. కావున మామిడి రైతులు మండీల ద్వారా కానీ, ఎఫ్‌పీఓల ద్వారా అమ్మేటప్పుడు రైతు సేవా కేంద్రాల్లో పర్మిట్ నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకోసం 1-బి అడంగల్, ఆధార్ లింక్ ఉన్న బ్యాంక్ పాస్ బుక్ తీసుకుని వెళ్లాలన్నారు.అయితే పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే కోసి మార్కెటింగ్ చేసుకోవాలన్నారు. ఫ్యాక్టరీల వద్ద టోకెన్ మార్కెటింగ్ చేయాలని చెప్పారు. మార్కెటింగ్ చేసుకొన్న తరువాత రూ.4ల మద్దతు ధర నేరుగా రైతు ఖాతలో జమ అవుతుందన్నారు. మరిన్ని వివరాలు మీకు సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో తెలుసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది ప్రసన్న, నిరంజన్ రెడ్డి, మాధవి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ సంఘాల నియామకం

కడప సెవెన్‌రోడ్స్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ సంఘాల కార్యవర్గాన్ని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల నుంచి పలువురికి అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గాల్లో చోటు లభించింది. బద్వేలుకు చెందిన జగన్నాథం నాగేంద్రను రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా, జమ్మలమడుగుకు చెందిన ఎం.రామకృష్ణ నాయక్‌ను ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా, పులివెందులకు చెందిన ఎస్.మహేశ్వరిని ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శిగా, బద్వేలుకు చెందిన కుప్పల వెంకట రమణను కల్చరల్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా, జమ్మలమడుగుకు చెందిన భూమిరెడ్డి దివాకర్‌రెడ్డిని కల్చరల్ విభాగ సంయుక్త కార్యదర్శిగా నియమించారు.

- అన్నమయ్య జిల్లాలో రాజంపేట నియోజకవర్గానికి చెందిన గడికోట వెంకట సుబ్బారెడ్డిని రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శిగా, రాజంపేటకు చెందిన నాగేంద్ర నాయక్‌ను ఎస్టీ సెల్ కార్యదర్శిగా, పీలేరుకు చెందిన జి.అమర్‌నాథరెడ్డిని ప్రచార విభాగ ప్రధాన కార్యదర్శిగా, మదనపల్లెకు చెందిన కె.రత్నప్పను సాంస్కృతిక విభాగ సంయుక్త కార్యదర్శిగా, రాజంపేటకు చెందిన మోడెం నాగభూషణంను చేనేత విభాగ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

రెడ్డెమ్మకు శృంగభంగం!

ప్రజలు మార్పు కోరారు. అదృష్టవశాత్తు ఎమ్మెల్యే అయ్యారు. అధికారం ఉంది. సద్వినియోగం చేసుకొని ప్రజల కోసం, ప్రాంతం కోసం ఉపయోగపడాలి. కాగా కడప గడపలో తద్భిన్నమైన శైలి తెరపైకి వచ్చింది. అడుగడుగునా నియంతృత్వం తోడైంది. తాను పట్టిన కుందేలికి మూడే కాళ్లు అనడం ఆరంభించారు. వ్యక్తిగత టార్గెట్ దిశగా అడుగులు వేశారు. కాదు, కూడదంటే స్వపక్షం, విపక్షం తేడా లేకుండా ముప్పుతిప్పలు పెట్టడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. వెరశి ఉన్నత న్యాయస్థానం జోక్యంతో శృంగభంగం తప్పలేదు.

- మేయర్ సురేష్‌బాబుపై అనర్హత వేటు కోసం విశ్వయత్నం
- అధికార దుర్వినియోగానికి చెంపపెట్టుగా నిలుస్తున్న హైకోర్టు తీర్పు
- సర్వ సభ్య సమావేశాం నిర్వహణకు అడ్డంకులు సృష్టిస్తున్న వైనం
- కమిషనర్ మనోజ్‌రెడ్డి ద్వారా అనేక కుయుక్తులు





సాక్షి ప్రతినిధి, కడప: ప్రజాతీర్పును ప్రజాస్వామ్యవాదులు గౌరవించాలి. హోదా, స్థాయికి అనుగుణంగా హుందాగా నడుచుకోవాలి. సమస్యల పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులకు నిత్యం తపన ఉండాలి. అవకాశం ఉన్నంతలో అభివృద్ధి కోసం విశేషంగా పాటు పడాలి. ఉన్నతమైన ప్రజాప్రతినిధుల్లో అలాంటి వైఖరి కన్పించనడ సహజం. కడపలో తద్భిన్నమైన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. లేని ప్రొటోకాల్ కోసం మంకు పట్టు పడుతున్నారు. మేయర్ స్థానానికి దీటుగా తనకు కుర్చీ ఉండాలంటూ భీష్మించుకున్నారు. అందుకోసం ఎందాకైనా సరే, అంటూ ఏకంగా అనర్హత వేటు దిశగా అడుగులు వేశారు. కుర్చీ కోసం పంతం పట్టిన కడప రెడ్డెమ్మలో అడుగడుగునా నియంతృత్వం తెరపైకి వచ్చింది. అందుకు ఏకపక్షంగా వ్యవహరించే అధికారులు తోడయ్యారు. అధికారుల తప్పిదాన్ని మేయర్ సురేష్‌బాబుకు రుద్దారు. అంతే స్పీడుగా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్ష ఉత్తర్వులు వెల్లడించింది. ఈమొత్తం వ్యవహారాన్ని ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. అయినప్పటికీ కార్పొరేషన్ కేంద్రంగా చోటుచేసుకున్న వ్యవహారంలో ఎలాంటి మార్పు లేదు. శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించుకోగా, ఇప్పటికీ సమావేశం మందిరం తెరిచేందుకు కమిషనర్ మనోజ్‌రెడ్డి మనస్సు ఒప్పుకోవడం లేదు. మేయర్ సురేష్‌బాబు స్వయంగా కోరినా చలనం లేదు. అందుకు కారణం అనధికారికంగా ఎక్స్ అఫిషియో సభ్యులైన ఎమ్మెల్యేలకు మేయర్ స్థానంలోనే సీట్లు ఏర్పాటు చేయడమేనని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

కొనసాగుతున్న వేధింపులు

కార్పొరేషన్ కేంద్రంగా కమిషనర్ మనోజ్ రెడ్డిని అడ్డుపెట్టుకొని ఎమ్మెల్యే మాధవీరెడ్డి వేధింపులు కొనసాగిస్తున్నారని పలువురు వెల్లడిస్తున్నారు. మేయర్ కోరినప్పటికీ సమావేశం మందిరాన్ని కూడా తెరవకుండా కమిషనర్ డొంకతిరుగుడు ధోరణితో వ్యవహరించడాన్ని ప్రజాస్వామ్యవాదులు తప్పుపడుతున్నారు. మరోవైపు జిల్లా యంత్రాంగం ఏకపక్షంగా వ్యవహరిస్తోన్న ధోరణి నేపథ్యంలో కార్పొరేషన్ సర్వ సభ్య సమావేశం నిర్వహణకు కూడా కోర్టులను ఆశ్రయించాల్సిన దుస్థితిని నెలకొంది. సవ్యంగా సమావేశం కొనసాగించాలని, ప్రజాసమస్యలపై చర్చించాలని, అభివృద్ధి పనులపై తీర్మానాలు చేయాలనే ఆలోచన అటు అధికారులకు, ఇటు అధికార పార్టీ నేతలకు లేకుండా పోయిందని పలువురు వివరిస్తున్నారు. ఇప్పటికైనా హుందాగా వ్యవహరించి సవ్యంగా సర్వసభ్య సమావేశాన్ని కొనసాగించాలని ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు.

కుర్చీ చుట్టూనే వ్యవహారం....

కడప నగర పాలకమండలికి మేయర్ సుప్రీం. మేయర్ సీటు పైనుంటే ఎదురుగా కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు (ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు) వారికి కేటాయించిన స్థానాల్లో ఆశీనులు కావాల్సి ఉంది. అలా కాదు, అధికారంలో ఉన్నాం, మేయర్ సరసన నాకు సీటు ఉండాల్సిందేనని ఎమ్మెల్యేలు పట్టుబట్టడం అవివేకం. పైన కూర్చుంటే హోదా పెరగదు, ఎక్స్ అఫిషియో సభ్యులకు కేటాయించిన సీటులో కూర్చుంటే తరగదు. ఈ సత్యాన్ని విస్మరించి, ఇప్పటికీ రెండు పర్యాయాలు సర్వసభ్య సమావేశం నిర్వహించకుండా కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవీరెడ్డి అడ్డు తగిలారు. మందీ మార్బలంతో కార్పొరేషన్ కార్యాలయంలోకి ప్రవేశించి హంగామా సృష్టించారు. అధికారం అండతో సమావేశాన్ని అడ్డుతగులుదామనే ఆలోచన కంటే, ప్రజాసమస్యల పరిష్కారం కోసం చొరవ తీసుకుందామనే స్పృహ లేకుండా వ్యవహరిస్తున్నారు. గతంలో ఇలాంటి చరిత్ర ఎప్పుడూ తెరపైకి రాలేదు. విచక్షణ మరిచి హుందాతనం కోల్పోతున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

జూమ్ కౌన్సెలింగ్

- బదిలీల ప్రక్రియలో ఇబ్బందులు
- జూమ్ కాస్త జామ్ కౌన్సెలింగ్‌గా మారిన వైనం



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులు

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియను జూమ్ కౌన్సెలింగ్ ద్వారా చేపడుతున్నారు. ఈ విధానం జామ్ కౌన్సెలింగ్ గా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీల ప్రక్రియ బుధవారం నాటికి రెండోరోజుకు చేరింది. ఈ శాఖ పరిధిలో రాయలసీమ జిల్లాల్లోని వైద్య ఆరోగ్యశాఖ విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం బదిలీలను చేపడుతున్నారు. ఆ ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న వివిధ కేడర్లకు చెందిన ఉద్యోగులు జూమ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి వైఎస్సార్ జిల్లా కేంద్రంలోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో వచ్చారు.ఇక్కడ ఉద్యోగుల సౌకర్యార్థం ఒక సిస్టం ను కేటాయించారు. స్టాఫ్ నర్స్, ఎంపీ హెచ్‌ఎస్, ఎంపీహెచ్ ఈఓ, హెచ్‌ఈఓ, డీపీఎంఓ, పీహెచ్‌ఎన్ (టీ), సీనియర్ అసిస్టెంట్స్ తదితర కేడర్లకు చెందిన ఉద్యోగులు కౌన్సెలింగ్ లో పాల్గొనాలి. కాగా ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉండడం ఇతర సాంకేతిక కారణాలు తోడు కావడంతో సాయంత్రం అయినప్పటికీ అధిక సంఖ్యలో ఉద్యోగులు కౌన్సెలింగ్ కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నలుమూలల నుంచి వచ్చిన ఉద్యోగులు ప్రధానంగా మహిళా ఉద్యోగులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఉద్యోగుల సౌకర్యార్థం చేపడుతున్న జూమ్ కౌన్సిలింగ్ నత్త నడకన సాగుతూ జామ్ కౌన్సెలింగ్ గా మారిందని ఉద్యోగులు ఆరోపించారు.

డ్రోన్లను రైతులు వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్



రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: యాంత్రీకరణ పథకం కిసాన్ డ్రోన్ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, జేసీ ఆధ్వర్యంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం నిధుల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులకు వ్యక్తిగతంగా 50శాతం రాయితీపై వివిధ వ్యవసాయ యంత్ర పరికరాలను పంపిణీ చేశారు. జిల్లాలో 979 మంది చిన్న, సన్నకారు రైతులకు రూ. 14కోట్లు రాయితీ మంజూరైందని కలెక్టర్ చెప్పారు. దీనికి సంబంధించిన మెగా చెక్‌ను జిల్లా కలెక్టర్, జేసీల చేతులు మీదుగా లబిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారి మజీద్ అహ్మద్, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, పీలేరు, సహాయ వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర 2025లో భాగంగా ఈ నెల 21న జిల్లా వ్యాప్తంగా జరిగే యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ నంచి సబ్ కలెక్టర్లు, ఆర్డీఓ, జిల్లా అధికారులు, స్పెషల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు, మండల ప్రత్యేకాధికారులు, ఆర్‌ఐలు తదితరులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమంలో చేపట్టాల్సిన పనులపై దిశా నిర్దేశం చేశారు. యోగా సాధనతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

- మామిడికి కనీస మద్దతు ధర కల్పించాలి
- రైతుల దగ్గర కొనుగోలు చేయాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



జి శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి: అన్నమయ్య, చిత్తూరు జిల్లాలతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా మామిడి రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభ పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని, వారిని ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం రాయచోటిలో పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో మామిడి రైతులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రభుత్వం స్పందించాలని నిలదీశారు. పంటకు గిట్టుబాటు, మద్దతు ధరలు లేక రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణ పరిస్థితులతో పూత ఆలస్యంగా రావడం, వచ్చిన పూత నిలబడకపోవడం, అంతో ఇంతో కాసిన కాయలు గాలి, వానకు రాలిపోవడంతో సగం పంట పోయిందన్నారు. ఈ ఏడాది మొదటి నుంచి మామిడి రైతులు నష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు. కిలో తోతాపురి మామిడి రూ. 20 నుంచి రూ. 40వరకు ధర పలకాల్సి ఉండగా ర్యాంపుల వద్ద కిలో రూ. 4లకు అడుగుతున్నారన్నారు. జ్యూస్ ఫ్యాక్టరీలు కూడా కొనుగోలు చేయడం లేదని, రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఖర్చులు కూడా రాని పరిస్థితుల్లో రైతులు నిరాశలో కూరుకుపోయారన్నారు. రాయచోటి నియోజకవర్గంలో వేరుశనగ పంటతో పాటు మామిడి ప్రధాన పంట అయ్యిందన్నారు. నియోజకవర్గంలో మామిడి అధికంగా సాగు అవుతోందన్నారు. బేనీషా, మల్లిక, ఖాదర్ వంటి రకాలకు కూడా కనీస ధర లభించడం లేదన్నారు. ధరలు లేక తోతాపురి పంటను తోటల్లోనే వదిలేయాల్సిన పరిస్థితి నెలకొనడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మామిడి పంటకు కనీస మద్దతు ధర ప్రకటించాలని, కిలో రూ. 10లు అదనంగా చెల్లించాలన్నారు. పార్టీలకతీతంగా అందరి రైతుల నుంచి కొనుగోళ్లు చేయాలని కోరారు. రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసే కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. గుజ్జు పరిశ్రమలపై ఒత్తిడి తెచ్చిమామిడి కొనుగోలు చేయించాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో మామిడి కొనుగోలు చేయించాలని ప్రభుత్వాన్ని శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని ప్రతి మండల కేంద్రంలో మామిడి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా చేయాలన్నారు. దుక్కి దున్నడం నుంచి పంట కోయడం వరకు ఒక కిలో మామిడి పంటను తీయడానికి రూ. 7 నుంచి రూ. 15ల వరకు ఖర్చు అవుతుందన్నారు. పెట్టిన ఖర్చులు కూడా తిరిగిరావడం లేదని రైతులు వాపోవడం బాధాకరమన్నారు.

ఎకరాకు రూ.20వేలు పరిహారం ఇవ్వాలి

మామిడి రైతులకు పరిహారంగా ఎకరాకు రూ. 20 వేలు చెల్లించాలని శ్రీకాంత్ రెడ్డి కోరారు. మామిడి పంటకు ఇన్సూరెన్స్ ఇస్తే మంచిదన్నారు. మామిడి చెట్లు చనిపోతే ఇన్సూరెన్స్ ఇస్తామని ప్రభుత్వం చెబుతోందన్నారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో మామిడి తదితర ఉద్యాన పంటలకు పెద్దపీట వేశారన్నారు. రైతులు సంతోషంగా ఉండాలని మామిడి మొక్కలు ఉచితంగా ఇవ్వడం, 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్ అందించి ప్రోత్సహించడం వైఎస్సార్ పుణ్యమేఅన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌తోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందని తెలిపారు.

రెవెన్యూలో అవినీతి కంపు

- నకిలీ పత్రాలు సృష్టించి భూముల ఆక్రమణ
- యథేచ్ఛగా కొనసాగుతున్న అక్రమాలు
- నకిలీలకు వత్తాసు పలుకుతున్న అధికారులు



రాయచోటి: జిల్లా కేంద్రం రాయచోటి రెవెన్యూ కార్యాలయం మాఫియా, అవినీతి, అక్రమాలకు కేంద్రంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నకిలీ పత్రాలను సృష్టించి భూముల ఆక్రమణ అధికమైనట్లు తెలుస్తోంది. రాయచోటి పట్టణంతోపాటు నియోజకవర్గాల్లోని ఇతర మండలాల్లో తమకు అనుకూలమైన తహసీల్దారులను నియమించుకుని వారి అవినీతి, అక్రమాలను కొనసాగిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. రాయచోటి తహసీల్దార్ కార్యాలయంలో భద్రంగా ఉండాల్సిన భూముల రికార్డులు కొన్ని సంవత్సరాలుగా మాయమవుతూ వస్తున్నాయి. కోట్ల రూపాయలు విలువ చేసే రికార్డులు మాయమవుతున్నా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో ప్రభుత్వ భూములే కాకుండా ప్రైవేట్ వ్యక్తుల భూములకు కూడా నకిలీ పట్టాలు, డీకేటీ, మిలిటరీ పట్టాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయాన్ని కేంద్రంగా చేసుకొని కొన్ని దశాబ్దాలుగా మాఫియా బ్యాచ్‌లు రెచ్చిపోతున్నాయి. స్థానికంగా ఉన్న రెవెన్యూ అధికారుల నుంచి వీరికి మద్దతు లభిస్తుందడంతో అక్రమాలకు అంతులేకుండా పోయింది. ఇలాంటి పరిస్థితిలో నకిలీ రెవెన్యూ రికార్డులు, డీకేటీ పట్టాలు తయారు చేస్తున్న రెవెన్యూ సిబ్బందిపై జిల్లా కలెక్టర్ కొరడా ఝుళిపించారు. స్థానిక అధికారులు, వేగులు అందించిన సమాచారంతో కలెక్టర్ శ్రీధర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నకిలీ దస్త్రాలను కలిగి ఉన్న సిబ్బంది ఇళ్లపై దాడులు చేయించారు. రాయచోటి మండలం సిబ్యాలలో మాజీ వీఆర్వో నాగరాజు ఇంట్లో రెవెన్యూ అధికారులు, పోలీసులు సోదాలు చేశారు. వీఆర్వోగా పనిచేసిన నాగరాజు గతంలో భారీగా నకిలీ రెవెన్యూ రికార్డులు, అడంగల్, డీకేటీ పట్టాలు తయారు చేసినట్లు గుర్తించారు. ఆయన మరణించినా కుటుంబ సభ్యులు కూడా ఇదే పంథా కొనసాగిస్తున్నట్లు తేలడంతో తనిఖీ చేసి నిల్వ ఉన్న రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఇదే సమయంలో రాయచోటి పట్టణంలోని డిప్యూటీ తహసీల్దార్, మరో రెవెన్యూ సిబ్బంది ఇళ్లలో సోదాలు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. కొంతమంది భూ ఆక్రమణ దారుల నుంచి రెవెన్యూ అధికారులు, సిబ్బంది పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని ఇలాంటి నకిలీ పట్టా దారులను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

మాజీ అధికారులు.. భూ బకాసురుల ఇళ్లలో రికార్డులు

రాయచోటి రెవెన్యూ కార్యాలయంలో ఉండాల్సిన కొన్ని రికార్డులు మాజీ రెవెన్యూ అధికారులు, భూ బకాసురుల ఇళ్లలో ఉన్నట్లు స్థానిక అధికారుల నుంచి వస్తున్న సమాచారం. కార్యాలయంలో పనిచేసిన మాజీ అధికారులు ఇద్దరు డీకేటీ, మిలటరీ పట్టాలకు సంబంధించిన రికార్డులను తీసుకెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనేకమంది వారి పట్టాలకు సంబంధించిన సమాచారాల కోసం తరచూ వారిని ఆశ్రయిస్తున్నట్లు కూడా ప్రచారం ఉంది. అలాగే రాయచోటి పట్టణ పరిధిలోని భూములకు సంబంధించిన కొన్ని రికార్డులు అధికార పార్టీకి చెందిన మరో బకాసురుని వద్ద నిక్షిప్తంగా ఉన్నట్లు తెలియ వచ్చింది. దీనిపై స్థానిక అధికారులకు సమాచారం ఉన్నా వారిపై దాడులు చేయడం, లేదా వాటిని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేయలేకపోతున్నారు.

- రాయచోటి పట్టణ పరిధిలో నకిలీ పట్టాల దందా అధికం కావడంతో వాటిని తయారు చేస్తున్న వారిపై మరిన్ని దాడులు జరిగే అవకాశాలు ఉన్నట్లు రెవెన్యూ అధికారుల సమాచారం. ప్రస్తుతం ఇద్దరి గృహాలపై దాడులు నిర్వహించారని, త్వరలో మరో ముగ్గురు నకిలీ పట్టాల సృష్టికర్తలపై దాడులు నిర్వహించనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మాఫియాదే పెత్తనం

రాయచోటి రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంలో భూమాఫియా చెప్పిందే వేదంగా నడుస్తోంది. భూముల ధరలను మాఫియా ఆధీనంలోనే దళారులు ఆకాశానికి చేర్చారు. అదే మాఫియా వల్ల నేడు రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిందన్న ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ధరలు పడిపోవడంతో ఉన్న భూములకు నకిలీ పత్రాలు సృష్టించి వాటిని కాజేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం

నక్షత్ర తాబేలు లభ్యం



చిన్నమండెం: మండల పరిధిలోని చాకిబండలో స్థానికులకు నక్షత్ర తాబేలు లభించింది. చాకిబండ గ్రామం వరదన్నగారిపల్లె పొలాల్లో స్థానికులకు కనిపించింది. దీనిని స్థానికంగా ఉన్న చెరువులో వదిలినట్లు తెలిపారు.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య



రామాంజనేయులు మృతదేహం

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని కస్తూరిరాజుగారిపల్లి గ్రామం, చాకలగుట్టపల్లికి చెందిన రామాంజనేయులు (38) మంగళవారం వాస్మోల్ తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు లక్కిరెడ్డిపల్లి ఎస్ఐ రవీంద్ర బాబు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు చాగలగుట్టపల్లికి చెందిన రామాంజనేయులు భార్య, పిల్లలతో కలిసి బెంగుళూరులో జీవనం సాగిస్తూ ఉండేవారు. ఈ మధ్యకాలంలో స్వగ్రామమైన చాగలగుట్టపల్లికి కుటుంబంతో కలిసి వచ్చారు. రామాంజనేయులు తన భార్య తనతో మాట్లాడటం లేదనే నెపంతో ఇంట్లో ఉన్న వాస్మోల్ తాగి ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబ సభ్యులు హుటాహుటిన రాయచోటి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రామాంజనేయులు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు అరెస్ట్



అడవి పంది మాంసం, నిందితులను చూపుతున్న అటవీ అధికారులు

వీరబల్లి : మండలంలోని సానిపాయి ఫారెస్టు బీట్‌లోని ఎర్రచేను ప్రదేశంలో అడవి పందులను చంపి మాంసం తీసుకెళ్తున్న ఇద్దరు నిందితులను బుధవారం అరెస్టు చేసినట్లు సానిపాయి రేంజ్ ఫారెస్టు ఆఫీసర్ వైసీ రెడ్డి తెలిపారు. రహస్య సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అడవి పంది మాంసం తీసుకెళుతున్న నక్క నాగరాజు, జగన్నాథం అనే ఇద్దరిని గుర్తించి అరెస్టు చేశామన్నారు. ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఆసుపత్రిలో జ్వరాలతో ఉన్నవారిని పరీక్షిస్తున్న వైద్యాధికారి డాక్టర్ ప్రకాష్

సిద్దవటం : సిద్దవటం పరిసర గ్రామాల ప్రజలకు వైరల్ ఫీవర్స్ వస్తున్నాయని సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఆసుపత్రిలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ వైరల్ ఫీవర్స్ వాతావరణంలో మార్పుల వల్ల, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించక పోవడం వలన, తాగునీటి అపరిశుభ్రత తోనే వైరల్ ఫీవర్‌లు వస్తున్నాయన్నారు. జ్వరాలతో పాటు కడుపు నొప్పి, వాంతులతో కూడా జ్వరాలు వస్తున్నాయని, ఎవరైనా జ్వరాలు వస్తే సమీపంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించు కోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు. బుధవారం కూడా కొత్తమాధవరం, వంతాటిపల్లె పి. కొత్తపల్లి, సిద్దవటం ఎగువపేట, జంగాలపల్లె గ్రామాల నుంచి జ్వరంతో వచ్చారని వారిని పరీక్షించి వైద్యం అందించామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లికి వందనం అడిగితే డిజిటల్ అసిస్టెంట్ దాడి

- అడాప్టర్‌తో కొట్టడంతో ముగ్గురుకి గాయాలు
- దేహశుద్ధి చేసిన గ్రామస్తులు



దాడిలో గాయపడిన నాగభూషణం, అనురాధ



చిరిగిన చొక్కాతో బాబా ఫకృద్దీన్

బి.కొత్తకోట : తల్లికి వందనం సొమ్ము ఖాతాకు జమ కాలేదు, ఎందుకు కాలేదో చెప్పాలని కోరిన గ్రామస్తులపై సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ దాడి చేసి ముగ్గురుని గాయపరచిన ఘటన బుధవారం బి.కొత్తకోట మండలంలోని వడిగలవారిపల్లె (గండువారిపల్లె) సచివాలయంలో జరిగింది. పోలీసులు, బాధితులు, గ్రామస్తుల కథనం మేరకు వివరాలు. బాబా ఫకృద్దీన్ ఐదు నెలల క్రితం వడిగలవారిపల్లె సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌గా నియమితులయ్యారు. ఇటీవల ప్రభుత్వం విద్యార్థులకు సంబంధించి తల్లికి వందనం పథకం కింద తల్లుల ఖాతాలకు రూ.13 వేలు చొప్పున జమ చేసింది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన అనూరాధ (35), శంకర (43), నాగభూషణం (46)లు రాయితీ వేరుశెనగ విత్తనకాయలను తీసుకోవడానికి సచివాలయం వద్దకు వచ్చారు. తర్వాత సచివాలయంలోకి వెళ్లి తల్లికి వందనం పథకం నిధులు జమ కాలేదని బాబా ఫకృద్దీన్‌కు చెబుతుండగా దురుసుగా ప్రవర్తించాడు. వారించబోయిన వారిపైనా ఆగ్రహంతో కేబుల్ అడాప్టర్‌తో దాడి చేసి కొట్టడంతో ముగ్గురుకి గాయాలయ్యాయి. దీనితో ఆగ్రహించిన గ్రామస్తులు బాబా ఫకృద్దీన్‌ను కార్యాలయంలో దేహశుద్ధి చేసి బయటకు లాక్కొచ్చారు. చొక్కా చిరిగిపోయింది. దీనితో సచివాలయం వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ ఘటనపై గ్రామ మహిళా సంక్షరణ అధికారి ఎం.అమ్ములు పోలీసులకు తెలపడంతో ఏఎస్ఐ, పోలీసులు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. గాయపడిన బాధితులను స్థానిక సీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బాబా ఫకృద్దీన్‌పై కేసు నమోదు చేశామని సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు చెప్పారు. ఈ ఘటనపై ఎంపీడీఓ కృష్ణవేణి విచారించారు. బాబా ఫకృద్దీన్ స్టేట్‌మెంట్ నమోదు చేశారు. అనురాధ, శంకర, నాగభూషణంలు తల్లికి వందనం నిధులు జమ కాలేదని చెప్పగా దానికి సంబంధించిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని చెబుతుండగానే వారు దాడి చేసి కొట్టారు. కార్యాలయంలో నిర్బంధించారని ఎంపీడీఓ విచారణలో పేర్కొన్నారు. అలాగే సచివాలయ ఉద్యోగులు, గుమ్మసముద్రం గ్రామస్తులను కూడా విచారించి వేర్వేరుగా వారి వివరాలను ఎంపీడీఓ నమోదు చేశారు. ఈ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్టు ఎంపీడీఓ కృష్ణవేణి చెప్పారు.

అప్పుల బాధలు తాళలేక భార్యా, భర్త ఆత్మహత్యాయత్నం

భర్త మృతి, వెంటిలేటర్‌పై వైద్యం పొందుతున్న భార్య



నాగేంద్రరెడ్డి మృతదేహం

సిద్దవటం : మండలంలోని దేగనవాండ్లపల్లె గ్రామానికి చెందిన భార్య, భర్తలు అప్పుల బాధలు తాళలేక ఆత్మహత్యకు ప్రయత్నించారు. ఈ మేరకు భర్త నిమ్మకాయల నాగేంద్రరెడ్డి (35) మృతి చెందగా, భార్య పుష్పవేణి వెంటిలేటర్‌పై వైద్యం పొందుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నాగేంద్ర రెడ్డికి గ్రామంలో ఒక ఎకరా పొలం ఉంది. వ్యవసాయం చేసుకుంటూ కడపలో ప్రవేటు జాబ్ చేసుకుంటూ ఉన్నాడు. వ్యవసాయం, కడపలో ఉండేందుకు సుమారు రూ. 10లక్షలకు పైగా తెలిసినవారి వద్ద నుంచి అప్పులు తీసుకున్నాడు. ఈనెల 10వ తేదీన తిరుమల దర్శనం వెళుతున్నామని కుమారుడు అమర్‌నాథ్‌రెడ్డి, కుమార్తె లావణ్యలను తల్లిదండ్రులు మునిరెడ్డి, పార్వతమ్మల వద్ద వదిలి వెళ్లారు. ఈ నేపథ్యంలో తిరుపతిలోని ఓలాడ్జీలో రూమ్ తీసుకొని ఇద్దరు విషం తాగి ఫోన్‌లో తల్లిదండ్రులకు విషయాన్ని తెలిపి ఆసుపత్రిలో చేరారు. విషయాన్ని తెలుసుకున్న తండ్రి మునిరెడ్డి బంధువులతో కలిసి తిరుపతిలోని ఆసుపత్రికి వెళ్లారు. నాగేంద్రరెడ్డి చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందగా, పుష్పవేణి అపస్మారక స్థితిలో ఉంది. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

రాఘవరాజుపురంలో చోరీ

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రాఘవరాజుపురం ప్రధాన రహదారిలో నివాసం ఉంటున్న మల్లు ప్రభాకర్ రెడ్డి ఇంటిలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఇంటి యజమాని, భార్య పిల్లలు తిరువన్నామలై వెళ్లా రు. ఇంట్లో ఎవరూ లేకపోవడం గుర్తించిన దొంగలు చోరీకి పాల్పడి 84 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకువెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హేమ సుందర్ రావు తెలిపారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు

రాయచోటి : మండల పరిధిలోని గుట్టపల్లె గ్రామంలో భూ ఆక్రమణపై గ్రామస్తులు తహసీల్దార్, పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. వారి వివరాల మేరకు.. గుట్టపల్లె గ్రామంలోని 202, 203, 207 సర్వే నెంబర్ల కు సంబంధించి భూమిని దాదాపు 20 మంది రైతులకు అసైన్‌మెంట్ కింద అధికారులు ధ్రువపత్రాలను అందించారని లబ్ధిదారులు తెలిపారు. అయితే బట్టా వాండ్లపల్లెకు చెందిన ఓ మహిళకు అడవికమ్మపల్లె సమీపంలో పొలం ఉన్నప్పటికీ ఎస్.సోమవరం గ్రామంలోని టీడీపీ నాయకుని అండతో సదరు సర్వే నంబర్లలో అక్రమంగా భూమిలో బోరు వేసి, చెట్లను నాటుతోందని లబ్ధిదారులు బుధవారం తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎస్ఐ భక్త వత్సలంకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆక్రమణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గుట్టపల్లె వాసులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ ఉద్యోగి మృతి



రోడ్డుప్రమాదంలో మృతిచెందిన మహేష్ (ఫైల్)

మదనపల్లె రూరల్ : రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ ఉద్యోగి మృతి చెందిన ఘటన మంగళవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ గంగాపురానికి చెందిన రెడ్డెప్ప, పార్వతమ్మ దంపతుల కుమారుడు మహేష్(24) బెంగళూరులో ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అదే కంపెనీలో పనిచేసే మదనపల్లె ప్రశాంత్‌నగర్‌కు చెందిన శంకర్ కుమార్తె ప్రమీలతో కలిసి మంగళవారం రాత్రి మదనపల్లె బైపాస్ రోడ్డులోని కల్యాణ మండపంలో జరుగుతున్న వివాహానికి హాజరయ్యారు. అనంతరం ప్రమీలను ఇంటివద్ద దింపేందుకు ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని బైపాస్‌రోడ్డులో వెళుతుండగా, అయోధ్యనగర్ సమీపంలో తంబళ్లపల్లె మండలం చెరువుముందరపల్లెకు చెందిన రాజిరెడ్డి(48) ఎదురుగా రావడంతో ఢీకొన్నాడు. ప్రమాదంలో మహేష్ తలకు తీవ్రగాయమై అధిక రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రాజిరెడ్డి, ప్రమీలను స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి మత్తులో వ్యక్తిపై దాడి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని రంగనాయకులపేట చింతమ్ నగర్‌లో దళిత మహిళపై దాడి చేస్తుండగా స్థానికంగా ఉండే రంగనాథ్ అనే వ్యక్తి అడ్డుకోవడంతో బుధవారం గంజాయి మత్తులో ఉన్న పలువురు యువకులు దాడిచేసి అతడిని తీవ్రంగా గాయపరిచారు. దీంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి తగిన చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్సకోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూమి కబ్జా



ప్రభుత్వ భూమిలో సూచిక బోర్డును ఏర్పాటు చేసిన దృశ్యం





జేసీబీల సాయంతో ప్రభుత్వ భూమిని చదును చేయిస్తున్న దృశ్యం

చిన్నమండెం : మండల పరిధిలోని వండాడి గ్రామం ఉప్పరపల్లె సమీపంలో ప్రభుత్వ భూమిని టీడీపీకి చెందిన మనోహర్‌రెడ్డి అనే వ్యక్తి దర్జాగా కబ్జా చేస్తున్నారు. సర్వే నెంబర్ 507లో ప్రభుత్వ జాగా ఉంది. గత మూడు రోజులుగా జేసీబీలు పెట్టి పనిచేయిస్తున్నా సంబంధిత అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఇక్కడ ప్రభుత్వం బోర్డును ఏర్పాటు చేసి ఇది ప్రభుత్వ భూమి.. ఇందులో ఎవరూ ప్రవేశించరాదని, ప్రవేశించిన వారిపై కఠినచర్యలు తప్పవని సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. అయినా సూచిక బోర్డును సైతం లెక్క చేయకుండా మనోహర్‌రెడ్డి అనే వ్యక్తి యథేచ్ఛగా భూమిని చదును చేసి ఆక్రమణ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దొంగతనం కేసులో పది నెలలు జైలు శిక్ష

మదనపల్లె రూరల్ : ద్విచక్ర వాహనం దొంగతనం కేసులో నిందితుడికి మదనపల్లె రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు 10 నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. వివరాలు.. 14/04/2024 తేదీన మదనపల్లె టౌన్ లోని మిషన్ కాంపౌండ్ సమీపంలో ఇంటి దగ్గర ఉంచిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. దీంతో బాధితుడు మదనపల్లి ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ అనంతరం నిందితుడైన పెద్దమండెం మండలం ముసలికుంట పంచాయతీ గున్న పోతుల వారి తండాకు చెందిన బి చిన్న వెంకటరమణ నాయక్ కుమారుడు బుక్ అశోక్ కుమార్ (32)ను అరెస్టు చేసి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. 2 వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి జె కీర్తన కేసు విచారణ చేసి బుధవారం నిందితుడికి 10 నెలల సాధారణ జైలు శిక్ష విధించారు.

వైఎస్సార్‌సీపీ నాయకులను వేధిస్తే ఉపేక్షించం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



సబ్ జైల్ వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

రాజంపేట రూరల్ : వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను కూటమి ప్రభుత్వం వేధింపులకు గురి చేస్తే ఉపేక్షించబోమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు హెచ్చరించారు. స్థానిక సబ్ జైల్‌లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు కొలవలి శ్రీధర్‌రెడ్డి, కొలవలి అమరనాథరెడ్డి, ప్రభాకరరెడ్డి, వంశీధర్‌రెడ్డిలను బుధవారం వైఎస్సార్‌సీపీ రాయలసీమ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డితో కలిసి మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంకు చెందిన వారు గ్రామ స్థాయిలోని ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారని మండి పడ్డారు. అకారణంగా, అక్రమంగా అరెస్టులు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఓబులవారిపల్లి మండలం జీవీపురం పంచాయతీలోని తల్లెంవారిపల్లిలో కొన్ని సంవత్సరాలుగా కొలవలి, చిన్నిరెడ్డి కుటుంబీకుల మధ్య భూ తగాదా నెలకొందని తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులైన కొలవలి కుటుంబీకులను వేధింపులకు గురి చేసే క్రమంలో వారిని రెచ్చగొట్టి చిన్నిరెడ్డి కుటుంబీకులు దాడికి పాల్పడ్డారన్నారు. తమ పై దాడికి వచ్చిన వారి నుంచి కాపాడుకునే ప్రయత్నంలో కొలవలి కుటుంబీకులు తిరిగి దాడి చేయాల్సి వచ్చిందన్నారు. ఇరు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఇరు వైపు వారికి గాయాలు అయినట్లు తెలియజేశారు. అయితే కేవలం వైఎస్సార్‌సీపీ నాయకులైన కొలవలి కుటుంబీకులపైన మాత్రమే కక్షతో కేసులు నమోదు చేయించి చిత్రహింసలు పెట్టి రిమాండ్‌కు పంపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం పచ్చని గ్రామాలలో చిచ్చు పెట్టి వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులను ఇబ్బందులకు గురిచేస్తే రానున్న రోజులలో వారికి అంతకు అంత బహుమతిగా అందజేస్తామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. మీ వెనుక మేము ఉన్నామని భరోసా ఇచ్చారు. రానున్నది జగనన్న రాజ్యం.. పోరాడుదాం పోయేదేమి లేదని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు ధైర్యం చెప్పారు. కూటమి ప్రభుత్వం పతనం గ్రామ స్థాయి నుంచే మొదలైందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు శివారెడ్డి, యువనాయకులు గల్లా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తల్లికి కుమారుడిని అప్పగించాం

ఎస్ఐ మహమ్మద్‌రఫీ



కనిపించకుండా పోయిన నవీన్‌కుమార్‌రెడ్డిని తల్లికి అప్పగించిన ఎస్ఐ మహమ్మద్‌రఫీ

సిద్దవటం : మూడు సంవత్సరాలకు పైగా తెలంగాణకు వెళ్లి తిరిగి ఇంటికి రాని కుమారుడు కంచర్ల నవీన్ కుమార్‌రెడ్డిని మంగళవారం తల్లిదండ్రులకు అప్పగించామని ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పోలీసు స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిద్దవటం మండలం దేగనవాండ్లపల్లె గ్రామానికి చెందిన కంచర్ల నవీన్‌కుమార్ బిటెక్ విద్యను పూర్తి చేసుకొని తల్లిదండ్రులతో ఉద్యోగం సాధించుకొని వస్తానని మూడు సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారన్నారు. అక్కడ ఉద్యోగం కోసం పట్టుదలతో గ్రూప్స్‌కు కోచింగ్ తీసుకున్నారన్నారు. ఉద్యోగం రాకపోవడంతో ఇంట్లోవాళ్లకు ముఖం చూపించలేక అక్కడే క్యాంటిన్‌లో పనులు, సినిమా ఫీల్డ్‌లో వర్కర్‌గా పనిచేసుకుంటూ జీవనాన్ని కొసాగించేవాడన్నారు. గ్రామంలో తల్లిదండ్రులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, కనీసం ఫోన్‌చేయడం కానీ చేయక పోవడంతో తల్లిదండ్రులు కంచర్ల తులశమ్మ, కంచర్ల రామసుబ్బారెడ్డిలు కుమారుని ఆచూకీ తెలియక పోవడంతో తల్లడిల్లారు. నెల క్రితం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో పోలీసులు నవీన్‌కుమార్‌రెడ్డి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారన్నారు. ఈనెల 14వ తేదీన హైదరాబాద్‌లో గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఎట్టకేలకు ఆచూకీ తెలుసుకొని హైదరాబాదులోని నవీన్‌కుమార్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రులను ఈనెల 17వ తేదీన పోలీసు స్టేషన్‌కు పిలిపించి అతడిని వారికి అప్పజెప్పామన్నారు.

అన్యాక్రాంత భూములను స్వాధీనం చేసుకుంటాం

రైల్వేకోడూరు అర్బన్ : అన్నమయ్య జిల్లాలోని దేవాదాయశాఖ పరిధిలో ఆలయాల భూములు అన్యాక్రాంతంలో ఉంటే ప్రతి ఎకరాను స్వాధీనపరుచుకుంటామని బుధవారం జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. రైల్వేకోడూరులోని భుజంగేశ్వర స్వామి ఆలయం, భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని దేవాదాయశాఖ ఆలయ భూములు ఇతర వ్యక్తుల ఆధీనంలో ఉన్నట్టు గుర్తించిన ప్రతి ఒకదానిని స్వాధీన పరుచుకుంటామన్నారు. ఆలయాల అభివృద్ధికి పూర్వీకులు ఇచ్చిన భూములు ఎంతో దోహదపడుతున్నాయన్నారు. అలాగే చిన్న ఆలయాలకు సంబంధించి ధూపదీప నైవేద్యాలకు దరఖాస్తు చేసుకునేవారు నిబంధనలు పాటించి దరఖాస్తు చేసుకోవాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జనార్దన్,ఈఓ కొండారెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

పొలం వద్ద ఉరి వేసుకుని రైతు ఆత్మహత్య



రామాంజనేయులు (ఫైల్)

లక్కిరెడ్డిపల్లి : మండల పరిధిలోని బూడిదగుంటపల్లెకు చెందిన సుబ్బగారి రామాంజనేయులు (38) అనే రైతు అప్పుల బాధ తాళలేక బుధవారం పొలం వద్ద ఉన్న షెడ్డులో ఇనుప కమ్మీకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రామాంజనేయులు ప్రతి సంవత్సరం వేరుశనగ, మామిడి, టమోటా పంటలు సాగు చేసేవాడు. ఈ మధ్య మామిడిలో అత్యధికంగా నష్టాలు రావడంతో అప్పుల బాధ అధికం కావడంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కృష్ణారెడ్డి సేవలు మరువలేనివి



కృష్ణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ భరత్, మాజీ ఎమ్మెల్యేలు

గాలివీడు : వైఎస్ఆర్ సీపీ నాయకుడు కృష్ణారెడ్డి సేవలు మరువలేనివని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్, మాజీ ఎమ్మెల్యేలు గడికోట మోహన్ రెడ్డి, ఆర్.రమేష్ కుమార్ రెడ్డిలు అన్నారు. బుధవారం నగురువాండ్ల పల్లెలో కృష్ణారెడ్డి పెద్దకర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా కృష్ణారెడ్డి కుటుంబం రాజకీయాల్లో వుందని, గ్రామంలో ప్రజల మన్నలను పొందారన్నారు. ఆయన లేని లోటు తీరనిదని, ఆయన కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు.

రియల్టర్ హత్యకేసులో వీడిన మిస్టరీ

- అనుమానించినట్లుగానే భర్తను కడతేర్చిన భార్య
- అక్రమ సంబంధాలు, వేధింపులు, బ్లాక్ మెయిల్ భరించలేక హత్య
- భార్యతో పాటు ఇద్దరు నిందితుల అరెస్ట్
- హత్య కేసులో నిందితురాలుగా కుప్పం డిప్యూటీ డీఎంహెచ్ఓ..?
- వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

మదనపల్లె రూరల్ : పట్టణంలో సంచలనం సృష్టించిన రియల్టర్ గంగాధర హత్యకేసు మిస్టరీ వీడింది. ముందు నుంచీ ఊహించినట్లుగా, గంగాధర హత్యకేసులో ప్రధాన సూత్రధారిగా భార్య వనిత ఉందనే అనుమానం నిజమైంది. హత్య జరిగిన తర్వాత పోలీసు విచారణలో పొంతన లేని సమాధానాలు చెప్పడంతో భార్య వనితను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆమెను విచారించారు. దీంతో హత్యకేసుకు సంబంధించిన వాస్తవాలను వనిత బయటపెట్టింది. కొరియర్ బాయ్ రెడ్డిరాము, ఆటో డ్రైవర్ గంజి మహేష్‌బాబు సహాయంతో భర్తను కడతేర్చినట్లు నేరం అంగీకరించింది. దీంతో నిందితులకు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం రాయచోటిలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో హత్యకు దారితీసిన పరిస్థితులను వెల్లడిస్తూ, ముగ్గురు నిందితులను అరెస్ట్ చూపారు. వివరాలు.. మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ నక్కలకుంట సమీపంలో నివాసం ఉంటున్న కృష్ణమూర్తి, నారాయణమ్మ కుమారుడు నారప్పగారి గంగాధర(37) స్థానికంగా రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారాలు నిర్వహిస్తుండేవాడు. ఈనెల 15వ తేదీ ఆదివారం రాత్రి గంగాధర నివాసంలోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి హాల్లో పడుకుని ఉన్న అతడిపై రాళ్లతో దాడిచేసి కొట్టి చంపేసినట్లు భార్య వనిత పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో తాలూకా పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, గంగాధర ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. 16వ తేదీ సోమవారం ఉదయం మృతుడు గంగాధర తమ్ముడు నారప్పగారి వెంకటేష్ తన అన్న మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ గంగాధర భార్య వనితతో పాటుగా మరికొంత మంది ప్రమేయం ఉండవచ్చని ఫిర్యాదుచేశాడు. దీంతో తాలూకా పోలీసులు వనితను అదుపులోకి తీసుకుని విచారించగా...2012లో గంగాధరతో తనకు వివాహం జరిగిందని, కుమార్తె హిమప్రియ, కుమారుడు మోక్షిత్ ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపింది. భర్త గంగాధర రియల్‌ఎస్టేట్, వడ్డీవ్యాపారాలు చేస్తూ, పలువురు మహిళలతో అక్రమసంబంధాలు పెట్టుకుని, వారికి డబ్బులు అప్పుగా ఇచ్చి, వారికి తెలియకుండా న్యూడ్ వీడియోలు, ఫోటోలను సెల్‌ఫోన్‌లో తీసుకుని, తర్వాత వారిని బ్లాక్ మెయిల్ చేస్తూ వశపరచుకునేవాడన్నారు. అదేవిధంగా భార్యనైన తనను శారీరకంగా, మానసికంగా హింసించేవాడని తెలిపింది. దీంతో అతడి వేధింపులు భరించలేక, అతడిపై కక్ష పెంచుకుని ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకుంది. హత్యచేసేందుకు పరిచయస్తులైన...కే.వి.పల్లె మండలం తీతవ వడ్డిపల్లెకు చెందిన సాదుం రెడ్డిరాము(38), మదనపల్లె పట్టణం ఎస్టేట్ ప్రాంతం పద్మావతి కల్యాణమండపం వద్ద నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ గంజి మహేష్‌బాబు(20) సాయం తీసుకుంది. భర్త గంగాధర ఇంటికి రాగా, అతడికి ఆహారంలో నిద్రమాత్రలు కలిపి పెట్టింది. అనంతరం ఇంటి హాలులో ఆదమరచి నిద్రిస్తుండగా, భార్య వనిత మరో ఇద్దరు నిందితులతో కలిసి తలపై బండరాయితో కొట్టి హతమార్చారు. కేసులో నిందితులను మదనపల్లె మండలం ఎర్రగానిమిట్ట టిడ్కో గృహాల సమీపంలో అరెస్ట్‌చేసినట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, కేసును ఛేదించిన మదనపల్లె డీఎస్పీ మహేంద్ర, సీఐ కళావెంకటరమణ, పోలీసు సిబ్బందిని అభినందించారు.



మీడియా సమావేశంలో హత్య వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

హత్యలో కుప్పం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గంగాదేవి..

రియల్టర్ గంగాధర హత్యకేసులో భార్య వనిత, ఇద్దరు నిందితులతో పాటుగా కుప్పం డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న గంగాదేవి ఉన్నట్లు సమాచారం. బుధవారం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో హత్యకేసులో నిందితులైన వనిత, రెడ్డిరామ్, మహేష్‌లతో పాటు ప్రభుత్వ వైద్యురాలు గంగాదేవికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం వారిని రాయచోటి జిల్లా ఎస్పీ కార్యాలయానికి తరలించారు.

వైద్యపరీక్షల నిర్వహణలో భాగంగా వైద్యురాలు గంగాదేవిని కేసులో ఏ–3గా పేర్కొన్నారు. గంగాధరను చంపేందుకు భార్య వనితకు నిద్రమాత్రలను గంగాదేవి సమకూర్చడంతో పాటు, హత్య తర్వాత అతను చనిపోయాడా లేదా అనేది నిర్ధారించడంలో సహాయపడినట్లు తెలుస్తోంది. అయితే గంగాదేవిని హత్యకేసుకు సంబంధించి మీడియా సమావేశంలో అరెస్ట్ చూపకపోవడం, ఆమె పాత్రపై వివరాలు వెల్లడించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విచారణలో అదుపులోకి తీసుకుని, వైద్యపరీక్షలు సైతం నిర్వహించి ఎందుకు పోలీసులు అరెస్ట్ చూపలేదన్నది పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.